నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
08.

## పచ్చదనం సాకారానికి యాప్

రాష్ట్రంలో స్వచ్ఛ పల్లెల సాకారం కోసం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ 'పచ్చదనం' పేరుతో ప్రత్యేక యాప్‌ను రూపొందించాలని నిర్ణయించింది. ప్రస్తుతం గ్రామాల్లో సిబ్బంది కొరత, మౌలిక సదుపాయాల లేమి, నిర్వహణ సమస్యల కారణంగా చెత్త సేకరణ సరిగా జరగడం లేదు. ఈ నేపథ్యంలో వంద శాతం చెత్త సేకరణ, దాని సంపూర్ణ వినియోగం సంకల్పంతో యాప్‌ను తయారు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు చెత్త పరిస్థితిని పంచాయతీ కార్యదర్శులు యాప్ ద్వారా అప్రమత్తం చేస్తారు.

nipuna
Every Wednesday Free Supplement
7 మే 2025
పేజీలు 8

## అంతర్జాతీయం

### ఉగ్రవాద బాధితుల నెట్‌వర్క్

- ఉగ్రవాద బాధిత సంఘాల నెట్‌వర్క్‌ను ఉగ్రవాద వ్యతిరేక ఐక్య రాజ్య సమితి కార్యాలయం ప్రారంభించింది. 'విక్టిమ్స్ ఆఫ్ టెర్రరిజమ్ అసోసియేషన్స్ నెట్‌వర్క్' అనే పేరుతో దీన్ని ఏర్పాటు చేశారు. ఈ తరహా వ్యవస్థ ఏర్పాటుకు 2022, సెప్టెంబర్‌లో సమావేశాన్ని నిర్వహించారు. అది ఇప్పుడు కార్యరూపం దాల్చింది.

### రాఫెల్ మెరైన్ కంబాట్

- 26 రాఫెల్ మెరైన్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లను ఫ్రాన్స్ నుంచి భారత్ కొనుగోలు చేయనుంది. ఇందుకు భారత్ రూ. 63,000 కోట్లు వ్యయం చేయనుంది.



### Aim4 natuRe

- కున్మింగ్-మాంట్రియల్ జీవ వైవిధ్య ఫ్రేమ్ వర్క్‌లో భాగంగా ఆవరణ వ్యవస్థల పునరుద్ధరణకు Aim4 natuRe అనే కొత్త విధానాన్ని రోమ్ కేంద్రంగా పనిచేసే ప్రపంచ ఆహార-వ్యవసాయ సంస్థ ప్రారంభించింది. ఇందుకు యూకే సాయం చేయనుంది. ఏఐఎం పూర్తి రూపం- యాక్సిలరేటింగ్ ఇన్నోవేటివ్ మానిటరింగ్ ఫర్ నేచర్ రెస్టోరేషన్.

### స్పెషల్ 301

- యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ ఆఫీస్ స్పెషల్ 301 రిపోర్ట్ జాబితాలో భారత్‌ను 'ప్రయారిటీ వాచ్'లో అమెరికా చేర్చింది. ఇది మేధో హక్కులకు సంబంధించిన జాబితా. ఈ జాబితాలో దేశాలను మూడు విధాలుగా వర్గీకరించారు. అవి ప్రయారిటీ ఫారిన్ కంట్రీ, ప్రయారిటీ వాచ్ కంట్రీ, వాచ్ లిస్ట్ కంట్రీ. భారత్‌ను ప్రస్తుతం ప్రయారిటీ వాచ్ లిస్ట్‌లో చేర్చారు. మేధో హక్కుల ఉల్లంఘన పరిరక్షణలో విఫలం ఉంటుందని భావించిన దేశాలను ఇందులో చేరుస్తారు. ఇందులో ఉండే దేశాలపై అమెరికా ప్రత్యేకంగా దృష్టి సారిస్తుంది.

### బుద్ధుడి అవశేషాలు

- సారనాథ్‌లోని బుద్ధుడి అవశేషాలను తొలి సారిగా వియత్నాంలో యూఎన్ వెసాక్ రోజున ప్రదర్శించనున్నారు. మే 12న యూఎన్ డే ఆఫ్ వెసాక్ నిర్వహిస్తారు. బుద్ధుడి జ్ఞానోదయానికి గుర్తుగా ఈ ప్రదర్శన జరగనుంది.

### సిప్రి నివేదిక

- ప్రపంచ సైనిక వ్యయం- 2024 నివేదికను స్టాక్‌హోం ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ విడుదల చేసింది. భారత సైనిక వ్యయం 86.1 బిలియన్ డాలర్లు ఉంది. పాకిస్థాన్ చేసే సైనిక వ్యయంతో పోలిస్తే ఇది తొమ్మిది రెట్లు ఎక్కువ. అలాగే సైనిక వ్యయంలో భారత్ అయిదో స్థానంలో ఉంది. తొలి నాలుగు స్థానాల్లో అమెరికా, చైనా, రష్యా, జర్మనీ ఉన్నాయి.



## తెలంగాణ

### రామకృష్ణా రావు

- రాష్ట్ర ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణా రావు బాధ్యతలు స్వీకరించారు.

### శాంతి కుమారి

- మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ వైస్ చైర్‌పర్సన్‌గా శాంతి కుమారి నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వహించి ఏప్రిల్ 30న పదవీ విరమణ పొందారు.

### మామిడికి తెలంగాణ బ్రాండ్

- రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే మామిడి పండ్లను తెలంగాణ బ్రాండ్ పేరిట రైతుల ద్వారానే విదేశాలకు ఎగుమతి చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ఉద్యాన శాఖ రూ. 35 కోట్లతో ప్రతిపాదనలను రూపొందించింది. మామిడిపై ఉండే పురుగులను తొలగించేందుకు వీలుగా రేడియేషన్ ప్రక్రియను నిర్వహించేందుకు రూ. 24 కోట్లతో అటామిక్ రీసెర్చ్ ఎనర్జీ యంత్రం, మామిడిని మెరిసేలా చేసేందుకు రూ 5. కోట్లతో వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, మామిడిని మగ్గ బెట్టేందుకు రూ 3. కోట్లతో హాట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, రూ 4. కోట్లతో కోల్డ్‌రూం ఏర్పాటుతో పాటు ఇంటిగ్రేటెడ్ ప్యాకింగ్‌కు రూ 2. కోట్లు వెచ్చించనున్నారు.



### చిత్రారామచంద్రన్

- తెలంగాణ రియల్ ఎస్టేట్ అప్పిలేట్ ట్రిబ్యునల్ తాత్కాలిక చైర్‌పర్సన్‌గా విశ్రాంత ఐఏఎస్ అధికారి చిత్రారామచంద్రన్ నియమితులయ్యారు. ఈ స్థానంలో ఇప్పటివరకు కొనసాగిన జస్టిస్ రాజశేఖర రెడ్డి రాష్ట్ర లోకాయుక్తగా నియమితులయ్యారు.

### యుద్ధ్‌వీర్ పురస్కారం



- ప్రముఖ చిత్రకారుడు తోట వైకుంఠంకు 32వ యుద్ధ్‌వీర్ ఫౌండేషన్ స్మారక అవార్డ్ లభించింది. చిత్రకళా రంగంలో చేసిన కృషికి ఈ పురస్కారాన్ని అందుకున్నారు.

### ఇక్రిశాట్‌తో ఒప్పందం

- రాష్ట్రంలో 2500 మహిళా స్వయం సహాయక సంఘాలతో ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు సాంకేతిక సహకారం అందించేందుకు రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఇక్రిశాట్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు సెర్ప్ ఆర్థిక సాయం అందిస్తుంది. వారికి అవసరమైన సలహాలు, సూచనలను ఇక్రిశాట్ అందిస్తుంది. ఇక్రిశాట్‌లోని అగ్రి బిజినెస్ ఇంక్యుబేషన్ ప్లాట్‌ఫాం ద్వారా మహిళా సంఘాలకు శిక్షణ ఇస్తారు.

### పౌర సరఫరాల శాఖకు గుర్తింపు

- ప్రజా పంపిణీ వ్యవస్థలో మెరుగైన సేవలు అందిస్తున్న పౌర సరఫరాల సంస్థకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఐఎస్‌వో 9001:2015 సర్టిఫికెట్‌తో పాటు ఫైవ్ స్టార్ రేటింగ్‌ను పొందింది.

## వార్తల్లో వ్యక్తులు

### మార్క్ కార్నీ

- కెనడా ప్రధానిగా మార్క్ కార్నీ కొనసాగనున్నారు. ఆయన లిబరల్ పార్టీకి చెందిన వ్యక్తి. ఎన్నికల్లో ఆ పార్టీ విజయం సాధించింది.

### కమ్లా పెర్సాద్-బిసెసర్



- ట్రినిడాడ్-టొబాగో దేశ ప్రధానిగా కమ్లా పెర్సాద్ బిసెసర్ బాధ్యతలు స్వీకరించనున్నారు. పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో యునైటెడ్ నేషనల్ కాంగ్రెస్ విజయం సాధించింది. కమ్లా ఇదే పార్టీకి చెందిన నేత.

### ప్రతీక్ శర్మ

- ఉధంపూర్‌లోని ఉత్తర సైనిక కమాండ్‌లో అధికారిగా లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ బాధ్యతలు స్వీకరించారు.

### మోహన సాయి

- సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన యువ శాస్త్రవేత్త ఆకుల మోహన సాయి 5, 9 తేదీల మధ్య అమెరికాలోని అరిజోనాలో నిర్వహిస్తున్న అనలాగ్ వ్యోమగామి శిక్షణకు ఎంపికయ్యారు. అంగారక గ్రహం ఉపరితలంలో పరిస్థితులు, అక్కడ జీవనం, పనిచేయడం ఎలా ఉంటుందనే అంశాలపై శాస్త్రీయ అధ్యయనం చేసేందుకు ప్రత్యేకంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

### శైలజ

- కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్‌లో విశిష్ట శాస్త్రవేత్త (డిస్టింగ్విష్డ్ సైంటిస్ట్-డీఎస్)గా ఐఐసీటీ మాజీ శాస్త్రవేత్త



దోనెంపూడి శైలజ నియమితులయ్యారు. ఈ పదవిని చేపట్టిన తొలి మహిళ ఆమె.

### మధుసూదన్ సాయి

- శ్రీ సత్యసాయి సంజీవని బాలల ఆస్పత్రిని నిర్వహిస్తూ సేవ చేస్తున్న మధుసూదన్ సాయికి ఫిజీ దేశ అత్యున్నత పురస్కారం 'కంపానియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఫిజీ' లభించింది.

### సుజాత చతుర్వేది

- యూపీఎస్సీ సభ్యురాలిగా సుజాత చతుర్వేదిని రాష్ట్రపతి నియమించారు.

## ఆర్థికం

### ఉద్యోగావకాశాల ఒప్పందం

- నేషనల్ కెరీర్ సర్వీస్ పోర్టల్ ద్వారా ఉద్యోగాల కల్పన కోసం కేంద్ర కార్మిక-ఉపాధి కల్పన శాఖ మంత్రిత్వ శాఖ, ర్యాపిడోలు అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. రానున్న 1-2 సంవత్సరాల్లో సుమారు 50 లక్షల మంది యువతకు ఉద్యోగాలను కల్పించేందుకు ఉద్దేశించిన ఒప్పందం ఇది. ఇందులో అయిదు లక్షల మంది మహిళలకు కూడా ఉద్యోగాలను కల్పించనున్నారు.

### ప్రవాహ్

- ఇది సంక్షిప్త రూపం. పీఆర్ఏవీఏఏహెచ్‌ను విస్తరిస్తే ప్లాట్‌ఫాం ఫర్ రెగ్యులేటరీ అప్లికేషన్, వ్యాలిడేషన్ అండ్ ఆథరైజేషన్. మే 1 నుంచి ఈ పోర్టల్ వినియోగాన్ని ఆర్‌బీఐ తప్పనిసరి చేసింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, ఇతర నియంత్రణ సంస్థలు తమకు ఆర్‌బీఐ నుంచి ఎలాంటి అనుమతి లేదా అధీకృత పత్రాలు కావాలంటే ఈ పోర్టల్ ద్వారానే ఇవ్వనున్నారు.

### పీఎంఎల్ఏ పరిధిలోకి ఐ4సీ

Indian Cyber Crime Coordination Centre

- ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నుంచి సమాచారాన్ని పంచుకొనేందుకు, తీసుకొనేందుకు ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ)కు అనుమతి లభించింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ చట్టం సెక్షన్ 66 పరిధిలోకి ఐ4సీని చేరారు. సైబర్ పద్ధతుల్లో మనీలాండరింగ్‌కు పాల్పడుతున్న వారిని గుర్తించేందుకు వీలు కల్పించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

## రోజులు-ప్రాధాన్యం

### మే 1

- ఏటా మే 1న కార్మిక రోజుగా నిర్వహిస్తారు. పని సమయం రోజుకు ఎనిమిది గంటలకు కుదించాలని డిమాండ్ చేస్తూ 1886లో చికాగోలో మే 1న కార్మికులు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఇదే రోజును ప్రపంచ కార్మిక దినోత్సవంగా ఎంపిక చేశారు.

### ఏప్రిల్ 28

- ఏటా ఏప్రిల్ 28న వరల్డ్ డే ఫర్ సేఫ్టీ అండ్ హెల్త్ ఎట్ వర్క్‌గా నిర్వహిస్తారు. అంటే విధులు నిర్వహించే ప్రదేశాల్లో ఆరోగ్యం-భద్రతల ప్రాధాన్యాన్ని తెలిపే రోజు.

### ఏప్రిల్ 26

- ఏటా ఏప్రిల్ 26న ప్రపంచ మేధో హక్కుల రోజుగా నిర్వహిస్తారు. ఈ ఏడాది ఇతివృత్తం 'ఐపీ అండ్ మ్యూజిక్: ఫీల్ ది బీట్ ఆఫ్ ఐపీ'.

## జాతీయం

### జాతీయ భద్రతా సలహా బోర్డ్

- పాకిస్థాన్‌తో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న సందర్భంలో జాతీయ భద్రతా సలహా బోర్డ్‌ను కేంద్రం పునర్‌వ్యవస్థీకరించింది. ఈ బోర్డ్‌కు రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ మాజీ చీఫ్ అలోక్ జోషి నాయకత్వం వహిస్తారు. ఇందులో ఆరుగురు సభ్యులు ఉంటారు. ముగ్గురు సైనిక అంశాల నేపథ్యం ఉన్నవారు అయితే ఇద్దరు ఐపీఎస్‌లు, మరొక ఐఎఫ్ఎస్ అధికారి ఉన్నారు. ఇందులోని సైనికాధికారులు పీఎం సిన్హా, ఏకే సింగ్, మోంటి ఖన్నా. ఐపీఎస్ అధికారులు రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్ సింగ్, ఐఎఫ్ఎస్ అధికారి వెంకటేశ్ వర్మ.

### కులగణన


- దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది. త్వరలో చేపట్ట



బోయే జనగణనలో దీన్ని కూడా భాగం చేయనున్నారు. జనగణన అనేది కేంద్ర జాబితాలోని అంశం. అలాగే చెరకుకు ఇచ్చే ఫెయిర్ అండ్ రెమ్యూనరేటివ్ ప్రైస్‌ను 2025-26కు క్వింటాలుకు రూ. 355కి పెంచుతూ కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది.

### జపాన్, సింగపూర్ దేశాలకు హరిత హైడ్రోజన్

- 4.12 లక్షల టన్నుల హరిత హైడ్రోజన్ ఉత్పాదకాలను జపాన్, సింగపూర్ దేశాలకు భారత్ ఇవ్వనుంది. అలాగే గ్రీన్ హైడ్రోజన్ సర్టిఫికేషన్ స్కీమ్ ను కూడా భారత్ ప్రారంభించింది. హైడ్రోజన్ ఉత్పత్తిలో పారదర్శకత కోసం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉత్పత్తి అయిన హరిత హైడ్రోజన్ ఉత్పత్తి కోసం పునరుత్పాదక శక్తి వనరులనే వినియోగించారా? లేదా? అనే అంశాన్ని తెలుసుకొనేందుకు ఇది ఉపయోగపడనుంది.




### గగనతలం మూసివేత

- పహల్గాం దాడి అనంతరం జరిగిన పరిణామాల్లో పాకిస్థాన్ భారత విమానాలకు తన గగనతల అనుమతిని నిలిపివేసింది. తాజాగా భారత్ కూడా అదే నిర్ణయం తీసుకుంది. పాకిస్థాన్ విమానాలను భారత గగనతలం నుంచి అనుమతించరు. ఏప్రిల్ 30 నుంచి మే 23 వరకు ఇది అమల్లో ఉంటుంది.

వి. రాజేంద్ర శర్మ
ఫ్యాకల్టీ
9849212411

